పోనీ గాని, అనీరు నా పెదిమలతో తుడిచి, ఆ మెరిసే పాపల్లో అనంతమైన సౌందర్య స్వర్గాన్ని చూడనీ !

దీంటో తప్పేముంది ?

కాంతులు చిమ్మే శుక్రుడిమీద చిరుమబ్బు కమ్మితే దాన్ని తుడిచి ధగధగ మనే నా కోర్కెవలె మండే, ఆ ప్రేమలోకపు కాంతిని అనిమిషుడనై చూడ్డానికి ఆశపడడం తప్పుకాదు.

ఛీ ! తప్పు కానేకాదు.

తల పైకెత్తి నీలాంబరాన స్వచ్ఛందంగా గాలిలో విహరించే మేఘాలను చూడలేని అర్ధాంధులకు తప్పు మన కేమి తప్పు ?

నక్షత్రాల మధ్య వుండే అగాధమైన లోతుల, గాధమైన అంతాన్ని స్పృశించే అమరత్వం పొందిన నీకూ నాకూ తప్పేమిటి ?

ఛీ పిచ్చి ఇంకా నీకు.

ఈ నీతి లోకపు వాసనలు పోలేదా ?

ఎంత తప్పు ?

★

# రుషులూ-యోగులూ

పూర్వకాలం రుషులూ, యోగులూ, కావడం, చాలా సుఖంగా వున్నట్టు కనపడుతుంది; యోగ్యతవుండాలిగాని, చిన్నతనంలో గురువు ఆశ్రమంలో భోజనమూ అదీ జరిగిపోయేది తరవాత సొంత రిసర్చికోసం ఆశ్రమాలు స్థాపించుకునేవారు, ఈ శిష్యులు గురువులుగా తయారై.

గొడ్లనికాయడం, బట్టలు వుతకడం, ఊడవడం, అలకడం, వంటా, అంతా శిష్యులు చేసిపెట్టేవాళ్ళు. రాజాశ్రయంవల్ల తిండి జరిగిపోయేది. ఇప్పటి కవులమల్లేనే, సమితులుగా, యూనివర్శిటీల కింద, ఏర్పడి, ఎవరి అన్వేషణా ఫలితాల్ని వారు నివేదించికునేవారు వార్షికోత్సవాలలో. అంతే కాక, రాజులు సభ చేసినప్పుడల్లా అవీ ఇవీ గట్టిగా చదివి బహుమానాన్ని పొందేవారు. యజ్ఞాలకి, యాగాలకి, వీళ్ళందరూ కూడారంటే, సులభంగా లక్ష ఆవులూ, ఏనుగులూ, లెక్కలేని ధనాలూ, సంభావనలు దొరికేవి. ఆ బహుమతుల్ని ఏం చేసుకునేవారా, ఎక్కడ దాచుకునే వారా, మరి లక్ష ఆవుల్ని ఏ సంతలోనో అమ్ముకుంటే కొనేవారెవరా అనిపిస్తుంది. ఆనాటి బంగారం, రత్నాలూ, వరాళాలు వింటే, ఈనాటి యుద్ధకాలపు కరెన్సీ కి గతి పట్టివుండదా అని సందేహం వొస్తుంది. కొందరికి ఉద్యోగాలుకూడా అయ్యేవి, రాజులదగ్గిర పురోహితులు మొదలైనవి. పెళ్ళిళ్ళు చేసుకోవొచ్చు; సంసారాలూ వుండవొచ్చు. అదీగాక, తీవ్ర తపస్సు చేసి ఏదేవినో, వేశ్యనో రప్పించి, విసుగుపుట్టగానే, సులభంగా వైరాగ్యంలోకి పోయి, ఆమెని మళ్ళీ ఆమె స్వస్థలానికి ఏ అపవాదూ లేకండా పంపెయ్యవొచ్చు. చచ్చింతరవాత వీళ్ళకి ఇంద్రుడి దగ్గిరో, బ్రహ్మదగ్గిరో సీట్లు రిజర్వు అయివుండేవి.

ఇంత సుఖంలోనూ, వీళ్ళకో పెద్ద బాధవుంది. వీళ్ళు నివసించే అడవులే, రాక్షసులకికూడా నివాసస్తలాలు. చాలా త్వరలో రాక్షసులు వీళ్ళ రుచి మరిగారు. ఆ పూటకికూర దొరక్కపోతే, అట్టా షికారుకుపోయి ఓఋషినితెచ్చి తరుక్కు తినేవారు. ఈ ఋషులకి యోగులకి రక్షణ అల్లా శాపదక్షత. కాని వేటగాళ్ళ మళ్ళేనే శాపం తీసేవ్యవధి నివ్వకండానే వీళ్ళని గొంతు నులిమేసే వారుగావును, ఆ రాక్షసులు. రాక్షస పల్లెలో ఓ రాక్షసాంగన ఇంకో రాక్షసాంగనతో,

"ఏం కూరమ్మా మీ యింటో?" అంటే,

"వంకాయీ మునీశ్వరుడూ" అంటుంది ఆమె

"మీ ఇంటో ఏం కూరమ్మా" అంటే,

"యోగి వేపుడు" అంటుంది, ఈ రెండో ఆమె.

ఇంతలో మూడో ఆమెవొచ్చి "ఇవాళ ఎవరిమొహం చూశారో, మా ఆయనకి ఏం దొరకలేదమ్మా. గురువుకి ఆకులు కోస్తూవుండగా ఇద్దరు బక్క శిష్యులు దొరికారు. చట్టి అడుగున అంటుకుపోయింది కూర" అంటుంది. "యోగులు దొరికితే సులభమమ్మా, ఈ రుషుల ఈకెలు పీకేప్పటికి చేతులు పడిపోతున్నాయి" అంటుంది మొదటి ఆమె.

కాని ఈ రుషులూ యోగులూ చాలాసార్లు కాటు వెయ్యనే వేసే వారు.

"మీ ఆయన ఏ రమ్మా కనపడటం లేదం"టే "ఏమోనమ్మా, మా అబ్బాయి పెద్ద కోరమొలిచిన పండక్కి ఓ బతికిన యోగిని తెమ్మన్నాను, పలావు వండుదామని. ఏమైనారో, రెండు వేల ఏళ్ళయింది. ఇంకా రాలేదు." అంటుంది.

"మొన్న సాయిత్రం మీ ఇంటిచుట్టూ మూలుగుతూ ఓ పెద్దపులి తిరుగుతోంది. అది మీఆయనేనేమో అనిపించింది. ఆయనమల్లే వెనక్కాలు కుంటుతోంది" అంటుంది ఆ రెండోఆమె.

ఇది వింటున్న మూడో ఆమె రంగంమీదికి వొచ్చి,

"అంతేనమ్మా మా చెల్లెలి మొగుడు అట్లానే ఓ యోగిని పట్టడానికి వెళ్ళి మళ్ళీ రాలేదు. సాయంత్రానికి ఓ పెద్ద కొండసిలవచ్చి ఆమె కాళ్ళను చుట్టేసుకుంది. ఆమె కేకలుపెడితే చంపడానికి వెళ్ళాం. తీరా దగ్గరికి వెడితే కొండసిలవకి పెద్దమీసాలు. వాటినిచూసి గుర్తుపట్టాం మా మరిది అని" అంటుంది.

ఇంతలో మూడో ఆమె—

"అంతకన్నా చిత్రం, మా మరదలు సంగతి తెలీదూ. అది నీళ్ళా డింది. పత్యానికని దాని మొగుడు బాలముని కోసమనిపోయి మాయమై నాడు. ఆరువేళ్ళ ఏళ్ళకి తిరిగి రాలేదు. తిండికి జరక్క మా తమ్ముణ్ణే చేసుకుంది. చేసుకున్న వెయ్యేళ్ళకే ప్రత్యక్షమైనాడు ఓ నాటి రాత్రి వాళ్ళ మంచంకింద కన్నంలోంచి. 'చూస్తున్నాలే నీ పోకిల్లు" అన్నాడు దాని కొప్పుపట్టుకుని, ఎట్లాచూశానంటే, నువ్వు వాణ్ణి కావలించుకున్నప్పుడల్లా మీ కాళ్ళ సందు కిచకిచమనే చుంచు ఎవరనుకున్నావు, నేనే. ఆ బాలయోగి వెధవ, కుత్తుక నులుముతుండగా, 'చుంచువవు అన్నాడు' అని యేడ్చాడు.

మొత్తానికి ఈ యోగులూ రుషులూ యీ రాక్షసుల అవసరాలకు లోకువైనారు. భారతీయ యుద్ధంలో 18 అక్షోణీలు ఎందుకు గుమిగూడారో తెలీదు. ఈ పెద్ద వీరుల చేతులతీట వొదిలేట్టు చంపుకోడానికితప్ప వాళ్ళు చేసిన ఒక్కపనీలేదు. భీష్ముడి ఆగ్నేయాస్త్రానికి ఇటు అర్ధలక్షా, భీముడి గదాఘాతానికి అటు ఓ లక్షా చావడం ఒక్కటే వాళ్ళకి నియమించిన ధర్మం. అట్లానే ఆటంబాంబుకింద ఆవిరికావడంతప్ప తక్కిన వివరాలు ఏమీ తెలీవు, నాగసీకా ప్రజల్ని గురించి. యీ యోగులు కొన్ని లక్షలూ కోట్లూ వరసగా ధ్వంసమౌతో వొచ్చారు. కాని ఆ ఆధ్యాత్మిక మదువు ఎట్లాంటిదంటే, ఎన్ని ఎలుగుబంట్లు దోచుకున్నా, మళ్ళీ ఆశ్రమపట్లు పెడుతూనే వుంటారు. చివరికి పడలేక ఏ ఇంద్రుడితోనో, విష్ణువుతోనో, మొర పెట్టుకుంటారు. దానివల్ల ఒక అవతారం. ఆ అవతారం పుట్టి నప్పుడూ చచ్చినప్పుడూ మధ్య, మధ్యా, స్తుతులకి ఆరాధనకి దండకాలు చదవడానికీ, వీళ్ళు హాజరౌతో వుంటారు. ఈ లోపల వీళ్ళనెవరూ భోజనా

నికి ఉపయోగించుకోపోతే, వీళ్ళకి కొవ్వు లేకపోతే వీళ్ళని బలిపించ డానికి కొన్ని ఏళ్లు కందమూలాలుతెచ్చి వీళ్ళ ఆశ్రమాల ముందు పడేస్తో వుండవొచ్చు, రాక్షసులు.

సౌరిస్ అంటుంది యీ ఆర్యులుకూడా జనసంఖ్య ఎక్కువై ఇంగ్లీషు వాళ్ళ పద్ధతిమీదే వ్యాప్తి పొందారని. ఈ రుషులుపోయి అనార్యుల దేశాల్లో ఆశ్రమాలు పెట్టుకున్నారు, ఆర్యావర్తం అడవుల్లో ఆశ్రమాలు ఎక్కువై సందులేక. మరి ఆ అనార్యులు వూరుకుంటారా? వీళ్ళని వొండుకుతింటారు, వూరగాయలూ పెట్టుకుంటారు. అదుగో మా రుషుల్ని హింసిస్తున్నారని వంక పెట్టి ఆర్యరాజులు యీ అనార్యులమీదికి దండెత్తి వోడించి రాజ్యాల్ని ఆక్రమించుకుని ఆర్యులికి చోటుచేసి, మతమూ, తమ నాగరికతా ప్రవేశ పెట్టేవారు. ఆర్యకవులు ఆ అనార్యుల్ని, అనాగరికులనీ, మనుష్య భక్షకులనీ, రాక్షసులనీ, మాయావులూ, పది, యిరవై తల వాళ్ళనీ, వర్ణించి, తమ రాజుల్ని పొగిడి అక్షర లక్షలు సంపాయించే వాళ్లు.

ఇవీ పురాణ గాథలన్నీ.

★